ప్రజాశక్తి

బుధవారం 6 డిసెంబర్ 2023 8 పేజీలు



గుంటూరు



పల్నాడు

తుపాను బీభత్సం!

- కుండపోతగా వాన
- స్తంభించిన జనజీవనం
- గుంటూరు జిల్లా అతలాకుతలం
- పల్నాడు జిల్లాలోనూ భారీ వర్షాలు
- పొంగుతున్న వాగులు, వంకలు
- పునరావాస కేంద్రాలకు 750 మంది తరలింపు
- బాపట్ల వద్ద తీరం దాటిన మిచౌంగ్



పొన్నూరు మండలం ఆలూరు వద్ద నీట మునిగిన వరి పనలు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

తుపాను ప్రభావంతో గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు కుండపోతగా వర్షం కురుస్తోంది. రాత్రి పొద్దు పోయేవరకు వర్షం కొనసాగింది. భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. బాపట్ల వద్ద తుపాను తీరం దాటడంతో భీకరమైన గాలులతో ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాల వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. గుంటూరు పచ్చిమ మండలంతో పాటు, పెదకాకాని, ప్రత్తిపాడు తదితర ప్రాంతాల్లో వర్షాలు వలన ఇళ్లల్లోకి నీరు రావడంతో 750 మందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. వీరికి రాత్రి బస ఏర్పాటు చేశారు. ఆహార పానీయాలను అందించారు.



పెదకాకాని మండలం నంబూరు వద్ద పొలంలోనుండి నీటిని బయటకు పంపుతున్న రైతు, వరి పొలంలో నిలిచిన నీరు

గుంటూరు జిల్లాలో పంటలకు అపార నష్టం జరిగింది. గాలులకు వరి పైరు నేలకొరిగింది. వరి పంట కోసి పనలపై ఉండగా వర్షాలకు నీటమునిగింది. వరితోపాటు పత్తి, మిర్చి, శనగ, ఆపరాలు పొగాకు పంటలకు అపార నష్టం వాటిల్లింది. రెండు జిల్లాల పరిధిలో లక్ష ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనాలు ఆధారంగా తెలుస్తోంది. వరి తడిసిపోయి రంగు మారే అవకాశం ఉంది. ఇందువల్ల రైతులకి నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. తెనాలి డివిజన్లోని పలు ప్రాంతాల్లో భారీ వర్షాలు గాలుల వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. గుంటూరు, తెనాలి, పొన్నూరు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పొన్నూరు వద్ద ఫీడర్‌లు విరిగి పడిపోవడంతో

▶ 2లో



గుంటూరు నగరం టిజెపిఎస్ కాలేజీ ఎదుట ప్రధాన రహదారిపై నిలిచిన వర్షపునీరు



పల్నాడు జిల్లా నాదెండ్ల మండలంలో మిర్చి పొలంలో నిలిచిన వర్షపునీరు



మంగళగిరి మండలంలో నేలవాలిన వరిపైరును పరిశీలిస్తున్న సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు తదితరులు

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి పాశం రామారావు - దెబ్బతిన్న పొలాల్లో పరిశీలన

ప్రజాశక్తి- గుంటూరు, దుగ్గిరాల, మంగళగిరి రూరల్

గత రెండు రోజుల నుండి తుపాను కారణంగా గుంటూరు జిల్లాలో 1.20 లక్షల ఎకరాల్లో వరిపంటకు తీవ్రనష్టం జరిగిందని ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. మంగళగిరి నియోజకవర్గంలోని దుగ్గిరాల, మంగళగిరి, పొన్నూరు నియోజకవర్గంలోని పెదకాకాని మండలాల్లో అధిక వర్షాలకు

▶ 2లో

ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు

తుపాను జాగ్రత్త చర్యలపై గుంటూరు, పల్నాడు జిల్లాల కలెక్టర్ల సమీక్ష

ప్రజాశక్తి-గుంటూరు

మిచౌంగ్ తుపాను ప్రభావం వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని అధికారులను గుంటూరు, పల్నాడు జిల్లా కలెక్టర్లు ఆదేశించారు. ఈ మేరకు గుంటూరు కలెక్టరేట్‌లోని తన ఛాంబర్ నుండి తుపాను పరిస్థితులను ఎదుర్కొనేందుకు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్త చర్యలపై తెనాలి సబ్ కలెక్టర్, గుంటూరు ఆర్‌డిఒ, తహశీల్దార్లు, ఎంపిడిఓలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులతో టెలి కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సమీక్షించారు. వరద ప్రభావిత ప్రాంతాలల్లో తాగునీరు, ఆహారం, పారిశుధ్యం, మందులపై ప్రత్యేక దృష్టి

▶ 2లో



టెలికాన్ఫరెన్స్ ద్వారా అధికారులతో మాట్లాడుతున్న గుటూరు జిల్లా కలెక్టర్

విద్యా సంస్థలకు బుధవారమూ సెలవు

2 లో

విద్యాసంస్థలకు సెలవు పొడిగింపు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మిచౌంగ్ తుపాను వల్ల భారీ వర్షాలు పడుతున్న కారణంగా గుంటూరు, పల్నాడు జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు బుధవారమూ సెలవు ప్రకటిస్తున్నట్లు అధికారులు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించి తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ హెచ్చరించారు.

ప్రాణ, ఆస్తి నష్టం జరుగకుండా చర్యలు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టాలన్నారు. కాకుమాను, ప్రత్తిపాడు, చేబ్రోలు, దుగ్గిరాల, కొల్లిపర, పొన్నూరు మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగా వర్షపాతం నమోదైనందున లోతట్టు ప్రాంతలల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించి పునరావాస శిబిరాలలో చేర్పించాలన్నారు. పునరావాస శిబిరాల నుండి వారు తిరిగి ఇంటికి వెళ్లే వరకూ అసౌకర్యం కలుగకుండా తాగునీరు, ఆహారం, మందులు, టాయిలెట్స్ సదుపాయాలు కల్పించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఎటువంటి ప్రాణ నష్టమూ జరుగలేదన్నారు. తుపాను బాపట్ల తీరం దాటిన తరువాత భారీ నుండి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపినందున ఎలాంటి అవాంఛనీయ ఘటనలూ జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు పకడ్బందీగా చేపట్టాలన్నారు. చెరువులకు ఎక్కడా గండి పడలేదని నీటి పారుదల శాఖ అధికారులు తెలిపారని, గండ్లు పడకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అన్నారు. విద్యుత్ స్తంభాలు కూలిన వెంటనే వాటిని పునరుద్ధరించి విద్యుత్‌ను సరఫరా చేయాలని చెప్పారు. గాలుల వలన రోడ్లపై చెట్లు పడినపుడు వాటిని తొలగించేందుకు అవసరమైన సామగ్రిని సిద్ధంగా వుంచుకొని రోడ్డు ప్రయాణాలు సక్రమంగా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అత్యవసర ఖర్చుల కోసం ప్రతి జిల్లాకు రూ.2 కోట్లను ప్రభుత్వం విడుదల చేసిందని, నిధుల విషయంలో రాజీ పడొద్దని సూచించారు. తుపాను వల్ల జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు జిల్లా కేంద్రానికి తెలియజేయాలని, జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నం.0863-2234014కు సమాచారాన్ని అందించాలని చెప్పారు. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించే అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకు అధికారులు సమన్వయంతో వారికిచ్చిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని కోరారు.



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో ఆస్తి నష్టం, ప్రాణం నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని అధికారులను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. మంగళవారం నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో విద్యుత్, రోడ్లు భవనాలు శాఖ అధికారులతో సమీక్షించారు. ఆస్తి, పంట నష్టంపై అంచనా వేసి నివేదికలు సిద్ధం చేయాలని చెప్పారు. అవసరమైన నిత్యావసర సరుకులను అందుబాటులో ఉంచాలన్నారు. సమీక్షలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మురళి, ఉద్యాన శాఖాధికారి బెన్నీ, పౌడా వి.సి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్‌రెడ్డి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

సహాయక చర్యలు చేపట్టండి : టిడిపి

వర్షాలతో ప్రజలు అవస్థలపై ఆర్‌డిఒ శేషిరెడ్డిని టిడిపి నరసరావుపేట నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు కలిసి మాట్లాడారు. పట్టణ శివార్లలోని ఎస్‌ఆర్‌కెటి కాలనీ, ఎల్‌టి నగర్, యానాది కాలనీ, బీసీ కాలనీ, చంద్రబాబు నాయుడు కాలనీలోని సమస్యలపై విన్నవించారు. ప్రజలు డ్రెయినేజీ సమస్యె ఎదుర్కొంటున్నారని, నీట మునిగిన పంట పొలాలను పరిశీలించామని అన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకీ పరిహారం అందించాలని, నష్టాన్ని తక్షణమే అంచనా వేయాలని కోరారు. తడిసిన ప్రతి గింజను కొనాలన్నారు.

మిర్చిరైతులు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి - వినుకొండ :

అధిక వర్షాల వలన లోతట్టు ప్రాంతాలలో నీరు నిలబడి మిరప పంట ముంపునకు గురై నష్టం వాటిల్లుతుందనీ వినుకొండ ఉద్యాన శాఖ అధికారి షేక్. నబి రసూల్ మంగళవారం తెలిపారు. అధిక తేమ వలన వేర్ల ద్వారా మొక్కకు అవసరమైన పోషకాలను తీసుకోలేదని, పైరును పురుగులు, తెగుళ్ల ఆశించడమే కాకుండా సూక్ష్మధాతు లోపాలు కూడా ఎక్కువగా కనపడే అవకాశం ఉందన్నారు. పంట దశ మరియు ముంపు ఉధతిని బట్టి తగిన జాగ్రత్తలు పాటిస్తే పంటను రక్షించుకొని నష్టాన్ని కొంతవరకు తగ్గించుకునే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం మిరప పంట పూత, పిందె మరియు కాయ దశలో ఉన్నదనీ ఆయన వివరించారు.

పొలంలో అధికంగా ఉన్న నీటిని వెంటనే బయటకి పంపించే ఏర్పాటు చేయాలి. వాలిపోయిన మొక్కలను జాగ్రత్తగా నిలబెట్టి మొదలు చుట్టూ మట్టిని ఎగదోయాలి. మొక్కలు ఉరకెత్తి తలలు వాల్చినట్లయితే వెంటనే చేరుకోవడానికి లీటర్ నీటికి 10 గ్రాములు యూరియా కలిపిన ద్రావణాన్ని వారంలో రెండుసార్లు పిచికారి చేయాలి. వడలిన మొక్కలకు లీటర్ నీటికి 5 గ్రాములు మెగ్నీషియం సల్ఫేట్ కలిపిన ద్రావణం పిచికారి చేసుకోవాలి. ఇనపధాతు లోపంతో మొక్కలు పాలిపోయినట్లు కనబడితే పది లీటర్ల నీటికి 50 గ్రాములు అన్న భేదితో పాటు ఒక నిమ్మ చక్కరసం కలిపి పిచికారి చేయాలి. పై పాటుగా అదనంగా ఎకరానికి 50 కిలోల యూరియా 25 కిలోల ఎంఒపి 200 కిలోల వేప పిండి వేయాలి. వర్షాలు ఆగిన వెంటనే 19: 19:19 లేదా 13: 00:45 లేదా యూరియా వంటి పోషకాలను పంటపై పిచికారి చేయాలి. పొలంలో నీరు నిలవ ఉండడం వలన ఎండు తెగులు ఆశించే అవకాశం ఉంది. దాని నివారణకు కాపర్ ఆక్సి క్లోరైడ్ మూడు గ్రాములు ఒక లీటర్ నీటికి లేదా మెటలాక్సిల్, మ్యాంకోజెబ్ కలిగిన తెగులు మందును రెండు గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని మొక్కల మొదలలో పోయాలి. రాత్రి ఉష్ణోగ్రతలు తగ్గడం వలన ఆకు మచ్చ తెగులు, బూడిద తెగులు ఆశించే అవకాశం ఉంది. ఆకు మచ్చ తెగులు నివారణకు కార్బడైజిమ్ ఒక గ్రాము లీటర్ నీటికి లేదా మాంకోజెబ్ రెండు గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేయాలి. బూడిద తెగులు నివారణకు మైక్లోబుటానిల్ అనే తెగులు మందును 1.5 గ్రాములు లీటర్ నీటికి కలుపుకొని పిచికారి చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ కానోఫోరా వంటి తెగుళ్ల ఆశించే అవకాశం ఉంది కాబట్టి ముందు జాగ్రత్త చర్యగా 10 లీటర్ల నీటికి 30 గ్రాముల కాపర్ ఆక్సీ క్లోరైడ్, ఒక గ్రాము స్ట్రెప్టో సైక్లిన్ కలిపిన ద్రావణాన్ని పిచికారి చేయాలి. వాతావరణం చల్లగా ఉండడంవల్ల రసం పీల్చే పురుగుల ఉధృతి పెరిగే అవకాశం ఉన్నందున నివారణకు పిప్రోనిల్ 2 మిల్లీ లీటర్లు ఒక లీటరు నీటికి లేదా అసిటామప్రిడ్ 1 గ్రాము లీటర్ నీటికి లేదా స్పైరోమేసిఫిన్ ఒ మిల్లీ లీటరు ఒక లీటరు నీటికి చొప్పున కలుపుకొని పిచికారి చేయాలి.



ఉద్యాన శాఖాధికారి షేక్. నబి రసూల్

ఇబ్బందుంటే ఈ నంబర్లకు ఫోన్ చేయండి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా



మిచౌంగ్ తుపాన్ నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి నియోజకవర్గంలో పర్యటించారు. శివారు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఎటువంటి సహాయం కావాలన్నా ఏ సమయంలోనైనా నేరుగా తనకు ఫోన్ నంబర్లకు 9440993399, 7901677063, 7901677062 ఫోన్ చేయొచ్చని చెప్పారు. తుపాను బాధితులకు సహాయక సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. బాధితులకు ఆశ్రయం కల్పిచేందుకు కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్లు 08647-222001, నరసరావుపేట మున్సిపల్ కమిషనర్ 9849905831, మున్సిపల్ ఇంజినీర్ 9849906583, డి.ఇ : 9849906582, ఏ.ఈలు : 9849907276, 9849907271 నంబర్లలో సంప్రదించాలన్నారు. నరసరావుపేట పట్టణ, శివారు లోతట్టు ప్రాంతాలో ఎమ్మెల్యే పర్యటించారు. తుపాను ఉధృతి తగ్గేవరకు గ్రామ వార్డు సచివాలయాలు తెరిచే ఉంటాయని, లోతట్టు లేదా పక్కా ఇళ్లులేని ప్రజలు వారి పరిధిలోని సచివాలయంలో వసతి పొందాలని సూచించారు. సిబ్బంది అందరూ 24 గంటలు అందుబాటులో ఉంటారన్నారు.

పొలాల్లో తిరిగితే కష్టాలు తెలుస్తాయి

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ఖరీఫ్ ప్రారంభం నుంచీ కష్టాలకు ఎదురీదుతూ, ఇప్పుడు తుపాన కారణంగా తీవ్రంగా నష్టపోయిన ఉమ్మడి గుంటూరు జిల్లా రైతులను ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు డిమాండ్ చేశారు. స్థానిక పండరిపురంలోని తన నివాసంలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఆఫీసు గదుల్లో కూర్చుని సమీక్షలు చేయడం కాకుండా నిండా మునిగిన పంటచేలల్లో పర్యటిస్తే ప్రభుత్వం, అధికారులకు కూడా అన్నదాతల కష్టాలు కనిపిస్తా యని ఆయన అన్నారు. రెండు రోజులుగా వణికిస్తున్న తుపాను ప్రభావంపై నష్టపోయిన వారికి యుద్ధప్రాతిదిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తుపాను కారణంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలోని దాదాపు అన్ని పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, మిర్చి, పత్తి, మొక్కజొన్న, పసుపు, శనగ పంటలు దెబ్బతిన్నాయని తెలిపారు. అసలే కరవు పంజా కారణంగా వర్షాభావంతో విత్తనాలు వేయడం ఆలస్యమైందని, జులైలో వర్షాలు కురిసినా తర్వాత ముఖం చాటేయడంతో అనేక సవాళ్లను దాటుకుని పంటల్ని కాపాడుకున్న రైతులకు ఇప్పుడు తుపాను రూపంలో ఊహించని విపత్తు వచ్చిపడిందని ఆవేదన వెలిబుచ్చారు. మిరప, పత్తి, మొక్కజొన్న, పసుపు, శనగ పైర్లలో ఈదురుగాలులకు పూత, కాయ రాలిపోయిందని, లక్షల రూపాయలు అప్పులు తెచ్చి పెట్టిన రైతుల్ని ఇప్పుడు సకాలంలో ఆదుకోకపోతే వారికి ఆత్మహత్యలే దిక్కవుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తుపాను బీభత్సం!

(మొదటి పేజీ తరువాయి)

రాత్రి వరకు సరఫరా పునరుద్ధరణ జరగలేదు. భారీ వర్షాలకు రహదారులన్నీ దెబ్బతిన్నాయి. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి.

వర్షాలకు ప్రజలు బయటకు వెళ్లలేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాలుగు రోజులుగా వ్యవసాయ కార్మికులు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలతో నిర్మాణరంగం పనులు పూర్తిగా నిలిచిపోయాయి. ఈ రంగంలో పని చేస్తున్న కార్మికుల ఉపాధి దెబ్బతింది. గుంటూరు మీదగా నడిచే పలు రైలు రద్దయ్యాయి. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణికుల్లేక వెలవెలబోయాయి. వ్యాపారం లేక చిరు వ్యాపారులు ఆర్థికంగా నష్టాన్ని చవిచూసవారు. గుంటూరులోని పేదల నివసించే అనేక కాలనీల్లో మురుగునీరు చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షాలతో జిల్లావ్యాప్తంగా చలిగాలులు తీవ్రమయ్యాయి. వృద్ధులు, చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు.

పల్నాడు జిల్లాలోని అనేక ప్రాంతాల్లో చెట్లు నేలకొరిగాయి. గణపవరం వద్ద కప్పగంజి వాగు పొంగి ప్రవహించింది. చిలకలూరిపేట వద్ద పొగాకు పంట నీట మునిగింది. గుంటూరు జిల్లాలోని తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి ఆహారం అందించాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. తుపాను ప్రభావంతో గత 36 గంటలుగా జిల్లాలో 200 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని, మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున మండలస్థాయి ప్రత్యేక అధికారులు, తహశీల్దార్లుల, ఎంపిడిఒను ఆదేశించారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా నిరంతరం అప్రమత్తంగా ఉంటూ అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మ్యాట్‌లతో పాటు, విద్యుత్ సౌకర్యం, మరుగుదొడ్లు వసతులు కల్పించాలన్నారు. వేడి వేడి ఆహారంతో పాటు, చిన్న పిల్లలకు పాలు సరఫరా చేయాలన్నారు. బుధవారం ఉదయం కూడా వారికి ఆహారం అందించాలన్నారు.

తుపాను బాధిత రైతులను ఆదుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

దెబ్బతిన్న పంటలను సిపిఎం ప్రతినిధి బృందం మంగళవారం పరిశీలించింది. ఈ సందర్భంగా పాశం రామారావు మాట్లాడుతూ అనేక వ్యయ ప్రయాసాలకోర్చి రైతులు పంటలు పండిరచారన్నారు. ఎకరాకు రూ.30-35 వేలు ఖర్చు చేశారని, పంట చేతికొచ్చే సమయంలో వచ్చిన తుపాను వల్ల కోత దశలో ఉన్న పంట నీటిలో మునిగిందని, వరి పైరు కిందకి వంగి నీటిలో తేలుతోందని చెప్పారు. ఎకరాకు 10-15 బస్తాలు దిగిబడి తగ్గే ప్రమాద ముందన్నారు. తడిసిన ధాన్యాన్ని వెంటనే రైతు భరోసా కేంద్రాల ద్వారా మద్దతు ధరకు కొనగోలు చేయాలని, తేమ శాతం పరిగణలోకి తీసుకోకుండా కొనాలని కోరారు. జిల్లాలోని మెట్ట ప్రాంతంలో పత్తి తీవ్రంగా దెబ్బతిన్నదని, మిర్చి పొలాలల్లో నీరు నిలిచి ఉరకెత్తే ప్రమాదముందని చెప్పారు. చేబ్రోలు, నారాకోడూరు, కాజ, తాడేపల్లి ప్రాంతాల్లో కూరగాయలు, ఆకు కూరల తోటలు తుపాను ప్రభావానికి గురయ్యాయని, అనేక చోట్ల ధాన్యం ఆరబోసి కళ్లాలపై ఉందని తెలిపారు. కింద, పైనా పరదా పట్టాలు వేసినా నీరు చేరి తడిసి పోతున్నాయనన్నారు. ప్రభుత్వ యంత్రాంగం సహాయ చర్యలు చేపట్టాలని, పరదా పట్టాలు సరఫరా చేయాలని కోరారు. అరటి పంటకు కూడా తీవ్ర నష్టం వాటిల్లే ప్రమాదముందన్నారు.

కౌలు రైతుల పరిస్థితి దారుణంగా ఉందని, రూ.12-25 వేల వరకు కౌలు చెల్లించి వ్యవసాయం చేస్తున్నాని, తుపాను వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. పొలాల్లో అధికారులు పరిశీలించి పంట నష్టాన్ని అంచనా వేయాలని, నష్టపోయిన రైతు లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయని, రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థలు సక్రమంగా లేక రోడ్లపై మురుగు చేరిందని, దీనివల్ల ప్రజలు అంటు వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు. వైద్యారోగ్య శాఖ వెంటనే స్పందించి తాగునీటికి క్లోరినేషన్ చేయాలని డిమాండ్ చేశారు. పరిశీలనలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఈమని అప్పారావు, నాయకులు కె.నాగేశ్వరరావు, ఎస్.ఆదిశేఖర్, మాధవరెడ్డి, సత్యామారెడ్డి, జె.బాలరాజు, నాగమల్లేశ్వరరావు, యోగేశ్వరరావు, ప్రకాశరావు, రామారావు, శ్రీనివాసరెడ్డి, పేరిరెడ్డి పాల్గొన్నారు.



దుగ్గిరాల మండలంలో రైతులతో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు

రికార్డు స్థాయిలో వర్షం


డిఇఒ ఆఫీసు ప్రాంగణంలో నిలిచిన వర్షపు నీరు

గుంటూరు జిల్లాలో భారీ వర్షాలు

ఒక్క రోజులోనే నెల రోజుల వర్షపాతం నమోదు

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

నెల రోజుల్లో కురవాల్సిన వర్షం ఒక్కరోజులోనే కురిసిన పరిస్థితి గుంటూరు జిల్లాలో ఏర్పడింది. మంగళవారం జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసాయి. 24 గంటల 200 మిల్లీమీటర్ల పైగా పలు మండలాల్లో వర్షపాతం నమోదయింది. చేబ్రోలు, పత్తిపాడు, పెదనందిపాడు తదితర మండలాల్లో 200 మిల్లీమీటర్లకు పైగా వర్షం కురిసింది. వారం ఎనిమిది గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు మేడికొండూరులో 133 మిల్లీమీటర్ల అత్యధిక వర్షపాతం నమోదయింది. జిల్లాలోని పలు మండలాల్లో మంగళవారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కురిసిన వర్షపాతం వివరాలు ఎలా ఉన్నాయి. (బ్రాకెట్లలో సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం 8 గంటల వరకు నమోదైన వర్షపాతం వివరాలు కూడా ఇలా ఉన్నాయి).

నమోదు వివరాలు

చేబ్రోలు 103.8, (108.2)	గుంటూరు పశ్చిమ 99.2 (73.2)	తాడికొండ 74.0 (79.2)
పెదనందిపాడు 117.4 (92.4)	కాకుమాను 58.6 (115.2)	పెదకాకాని 69.4 (79.0)
పత్తిపాడు 115.8(114.6)	దుగ్గిరాల 43.8(109.4)	మేడికొండూరు 133 (56.4)
ఫిరంగిపురం 112.6 (64.2)	కొల్లిపర 46.4 (105.8)	మంగళగిరి 62 (55.2)
గుంటూరు తూర్పు 95.6 (85.2)	పొన్నూరు 45.6 (85.8)	తాడేపల్లి 59.4 (48.6)
	తెనాలి 48.8 (82.4)	తుళ్లూరు 57.8 (37.8) మిల్లీమీటర్ల
	వట్టిచెరుకూరు 54.4 (81.4)	వర్షపాతం నమోదయింది.



మహిళ హత్య కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలో సంపత్ నగర్ వద్ద ఈనెల 1వ తేదీన ఒక మహిళను హత్య చేసిన ఘటనలో నిందితుడ్ని అరెస్ట్ చేసినట్లు సి.ఐ. ఎం. శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు తెలిపారు. లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని 6/3 లైన్ సంపత్ నగర్‌లో నివాసం ఉండే నిందితుడు షేక్ సైదా అలియాస్ అల్లాల శ్రీనివాసరావు పేట కు చెందిన షేక్ హసీనా అలియాస్ బాజీ తో వివాహేతర సంబంధం ఉంది. తనతో సంబంధం కొనసాగిస్తూ మరొకరు తో మాట్లాడుతుందని అనుమానంతో నిందితుడు షేక్ సైదా, మృతురాలని తన ఇంటికి తీసుకు వచ్చి చంపాడు. నిందితుడు సైదా ను అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపినట్లు సి. ఐ. తెలిపారు.

తక్షణం రూ.5 వేల కోట్లు ఇవ్వండి

కేంద్రానికి ఎంపీ గల్లా జయదేవ్ విజ్ఞప్తి

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

మిచౌంగ్ తుఫాన్ లో నష్టపోయిన ఆంధ్రప్రదేశ్ కి వెంటనే రూ 5,000 కోట్లు. విడుదల చేయాలని గుంటూరు పార్లమెంట్ సభ్యులు గల్లాజయదేవ్ కోరారు. ఈమేరకు మంగళ వారం ఆయన లోకసభలో మాట్లాడారు. తుఫాను ప్రభావంపై కేంద్ర బందాన్ని పంపి మధ్యంతర ఆర్థిక సహాయాన్ని విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. బంగాళాఖాతంలో తుఫాను కారణంగా గత రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నా యన్నారు. దిగువ కోస్తా ఆంధ్ర ప్రదేశ్‌లోని బాపట్ల వద్ద తీరం దాటడం వల్ల కోస్తా ప్రాంతంలో నష్టం అధికంగా ఉందన్నారు. భారీ వర్షాల వల్ల పంటలకు అపార నష్టం జరిగిందన్నారు. పంట నష్టం నమోదు చేసేందుకు కేంద్ర బందాలను పంపాలన్నారు.

కళ్లం వద్దే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి : టిడిపి

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : జిల్లా తెలుగు రైతు ఆధ్వర్యంలో ఎంటిఎంసీ పరిధిలోని చిర్రావూరు, గుండిమెడలో నీట మునిగిన వరి పొలాలను ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా కళ్ళం రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో రైతులు నష్టపోతున్నారని, ప్రభుత్వం సహాయ చర్య లు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం తేమ శాతంతో సంబంధం లేకుండా ప్రతి వడ్ల గింజను కల్లాల దగ్గరే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలని ఆయన అన్నారు రైతులను ఆదుకోవడం కోసం ప్రభుత్వం ముందుకు రావాలని అన్నారు.పంట నష్టపోయిన రైతులకు పదివేల రూపాయల చొప్పున నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. పంట పొలాలను పరిశీలించిన వారిలో నాయకులు అక్కి నేని సుబ్రహ్మణ్యం, నల్లి బోయిన శ్రీనివాసరావు, తమ్మా శంకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


గుండి మెడలో వరి పొలాలను పరిశీలిస్తున్న నాయకులు

ఊళ్లు, పొలాల నిండా నీళ్లు



పలు ప్రాంతాల్లో ఎమ్మెల్యే పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తుపాను నేపథ్యంలో నరసరావుపేట నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సూచించారు. పలు ప్రాంతాల్లో మంగళవారం పర్యటించిన ఆయన అధఙకారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి ప్రజలకు జాగ్రత్తలు సూచించాలని అధికారులను ఆదేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో చెరువులకు గండ్లు పడకుండా చూడాలన్నారు. విద్యుత్ ప్రమాదాలు చోటు చేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉండాలని అధికారులను కోరారు. చెట్లు, విద్యుత్ స్తంభాల కింద ఎవరూ ఉండవద్దని సూచించారు.



నీట మునిగిన సంజీవనగర్‌ను పరిశీస్తున్నా తహశీల్దార్ సుజాత

పునరావాస కేంద్రానికి బాధితులు

ప్రజాశక్తి - చిలకలూరిపేట

లోతట్టు ప్రాంతాలను తహశీల్దార్ జి.సుజాత సందర్శించారు. ఎవరికీ ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వినాయక నగర్, అడ్డరోడ్డు సెంటర్ సంజీవ నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించగా వినాయక నగర్ కాలనీలో సుమారు 30 ఇండ్లు నీట మునగడంతో 130 మందిని భారతరత్న ఇందిరా గాంధీ ఉన్నత పాఠశాల, పండరీపురంలోని పునరావాస కేంద్రానికి తరలించారు. బాధితుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందిన తహశీల్దార్ పేర్కొన్నారు.



సుందరయ్య కాలినిలో చెత్తను తొలిగిస్తున్న కార్మికులు

లోతట్టు ప్రాంతాల్లో కమిషనర్ పరిశీలన

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

పట్టణంలో లోతట్టు ప్రాంతమైన 19వ వార్డు సుందరయ్య కాలినీలో మున్సిపల్ కమిషనర్ కె.షమ్మీ మంగళవారం పర్యటించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న కాల్వల వద్ద చేరిన మురుగును కార్మికులతో శుభ్రం చేయించారు. చప్టాల వద్ద నిలిచిన వ్యర్థాలను తీయించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఇనప విద్యుత్ స్తంభాలను ఎవరూ ముట్టుకోవద్దని సూచించారు. చెట్లు ఏమైనా పడిపోతే తమకు సమాచారం ఇవ్వాలన్నారు. చెట్ల కింద ఎవరూ ఉండొద్దన్నారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలిగిన వెంటనే తమ కార్యాలయాన్ని సంప్రదించాలి సూచించారు.



ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

మిచౌంగ్ తుపాను ప్రభావంతో సత్తెనపల్లి ప్రాంతంలో రెండ్రోజుల నుండి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. పంటపొలాల నీటమునిగాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమైయ్యాయి. మిర్చి, వరి, మొక్క జొన్న పంటలకు తీవ్రనష్టం వాటిల్లింది. జనజీవనం స్తంభించి. దినసరి కూలీలు పనుల్లేక ఇబ్బందులు పడుతున్నారు. నిన్నమొన్నటి వరకు సాగునీటి కోసం అష్టకష్టాలు పడిన రైతులు ట్యాంకర్ల ద్వారా మిర్చి పొలాలకు సాగునీరు పెట్టుకున్నారు. తాజా వానలతో ఆ పొలాలన్నీ నీట మునిగాయి. ఈదురు గాలులకు పూత, పిందె రాలిపోయింది. మిర్చి మొక్కలు నేలకు ఒరిగాయి. మొక్కలు ఉరకెత్తుతాయని రైతులు వాపోతున్నారు. కోతకు సిద్ధంగా ఉన్నా వరి పంట నేలకొరిగింది. పాకాలపాడు రెంటపాళ్ల, కుందురువారిపాలెం గ్రామాల్లో మొక్క జొన్న పంటలు నేలకు ఓరిగాయి. నందిగామ ఊరి ముందువున్న వాగు పొంగి పొర్లి ప్రవహించి సత్తెనపల్లి - అమరావతి మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నందిగామలోని భీమవరం డొంకలో వున్న ఇళ్లు వర్షానికి నీటమునిగాయి. సత్తెనపల్లి పట్టణంలో లోతట్టు ప్రాంతాలైన నాగన్నకుంట, సుందరయ్య కాలనీలు జలమయమయ్యాయి. నాగన్నకుంటలో ఇళ్ళలోకి నీళ్ళు చేరటంతో ప్రజలు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. ఇదిలా ఉండగా సికింద్రాబాద్ నుండి సత్తెనపల్లి మీదుగా శబరీ, చెన్నై, నారాయణాద్రి ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. వానల నేపథ్యంలో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు.



ప్రజాశక్తి - మాచర్ల

నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని పలువురు రైతులు బోర్ల కింద వరి సాగు చేయగా కొద్దిమంది ఇప్పటికే తమ పంటను ఇళ్లకు చేర్చుకున్నారు. మరికొంతమంది ధాన్యాన్ని పొలాల్లో ఉంచారు. వానల నేపథ్యంలో కోతకు వచ్చిన వరి పంట నేల వాలిపోయింది. వర్షపు నీరు పొలాల్లో నిలబడి ఉండడంతో రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోతకోసిన మిర్చి కూడా కళ్లాల్లోనే ఉంది. ఆరబెట్టిన మిర్చిపై ఎన్ని పట్టాలు కప్పినా నిమ్ము తగిలి కాయ దెబ్బతింటుందని రైతులు వాపోతున్నారు. జమ్మలమడకకు చెందిన వరి రైతు బాసెట్టి వెంకటేశ్వర్లు వర్షంలో పొలానికి వచ్చి పడిపోయిన వరి పంటను చూసి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. మరో రెండు రోజులు ఇలాగే నీళ్లలో నానిపోతే పంట ఎందుకు పనికిరాదని, ఎకరానికి కౌలు సహా రూ.50 వేలు పెట్టుబడి పెట్టానని ఆవేదన వ్యక్తం చేశారు. 6 ఎకరాల వరి పంట వేసినట్టు తెలిపారు. మరోరైతు కోటేశ్వరమ్మ మాట్లాడుతూ పండించిన పంట చేతికి వచ్చింది అనుకునే సమయానికి వానొచ్చి, వానపాలవుతుంటే మా బాధ ఎవరికి చెప్పుకోవాని ఆవేదనకు గురయ్యారు. భర్త పిల్లలు కుటుంబం అందరం కలిసి ఈ రెండు రోజుల నుండి పట్టాలపై ఉన్న నీళ్లు తొలగించడానికి నానా కష్టాలు పడాల్సి వస్తోందని అన్నారు. తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ప్రభుత్వం సాయం చేయకుంటే కోలుకోలేమని చెబుతున్నారు.



ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలో వాగులు, వంకలు పొంగిపొర్లాయి. జనజీవనం స్తంభించింది. మండలంలో అధికంగా సాగైన పత్తికి తెగుళ్ల సోకి దిగుబడి తగ్గింది. మళ్లీ ఇప్పుడు వానలతో తాము పూర్తిగా నష్టపోతామని రైతులంటున్నారు. ఇదిలా ఉండగా ఇరుకుపాలెం వద్ద ఈదురుగాలుల ధాటికి రహదారి పక్కనున్న భారీ చెట్టు అటుగా వెళ్తున్న ఆర్‌టిసి బస్సుపై పడింది. బస్సు అద్దాలు పగిలినా ప్రమాణికులంతా క్షేమంగా ఉండడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు. ఎడతెరిపిలేని వాన నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని దింతెనపాడులో శనగ, మిర్చి పొలాలు నీట మునిగాయి. ప్రభుత్వం ఆదుకోకుంటే తాము పీకల్లోతు అప్పుల్లో కూరుకుపోతామని రైతులు, కౌలురైతులు వాపోతున్నారు.

వల కూలీలకు ఆహారం..

సుబాబుల్ తోటల్లో పని కోసం ప్రకాశం జిల్లా కందుకూరు నుండి యడ్లపాడు మండలంలోని సంఘం గోపాలపురం వెళ్ల మార్గంలో ఆర్‌ఎస్ సూపర్ మార్కెట్ సమీపంలో తోటలకు వచ్చిన వలస కూలీలకు అధికారులు ఆహారాన్ని సమకూర్చారు. కందుకూరు నుండి 20 మందికి రావడంతో, వీరికి సరైన ఆశ్రయం లేక ఇబ్బంది పడడాన్ని గమనించిన తహశీల్దార్ వైవిబి కుటుంబరావు, ఆర్ఐ చక్రవర్తి తదితరులు ఆహరపు ప్యాకెట్‌లు, బ్రేడ్ లు, బిస్కట్ ప్యాకెట్‌లు పంపిణీ చేశారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు

మండలంలోని మిరప పొలాల్లో వర్షపునీరు నిలిచింది. వర్షానికి తోడు గాలి కూడా వీచటంతో మొక్కలని ఒరిగాయి. మిరప కుళ్లిపోయే అవకాశం ఉంది. ప్రత్తి పంట కూడా తీవ్ర నష్టం వాటిల్లుతుంది. శనగ వంట కూడా కుళ్ళి పోయే అవకాశం ఉంది. గ్రామాల్లో వాగులు, వంకలు కూడా పొంగిపొర్లుతున్నాయి. విద్యుత్ సరఫరా పలుమార్లు నిలిపివేశారు.



ప్రజాశక్తి - వినుకొండ

వర్షం వస్తే వినుకొండ ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంగణం చెరువును తలపిస్తుంది. మంగళవారం తెల్లవారుజామున కురిసిన వర్షానికి బస్టాండ్ పరిసరాల్లో నీళ్లు నిలిచాయి. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం వల్ల మురుగునీరు, వర్షం నీరు కలిసి ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలో నిలిచింది. కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి తలెత్తుత్తి ప్రయాణికులు అవస్థ పడుతున్నా అధికారులు సరైన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు స్థానికుల నుండి వస్తున్నాయి.

మరోవైపు పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారుదల సరిగా లేని కారణంగా ప్రధాన డ్రెయినేజీలో ఎగువ నుండి కొట్టుకు వచ్చిన ప్లాస్టిక్ బాటిళ్లు, చెత్త చెదారం అంతా కాల్వలో అడ్డుపడటంతో మురుగు నీటిపారుదల నిలిచిపోయింది. కారంపూడి రోడ్డు, నరసరావుపేట రోడ్డు, మార్కాపురం రోడ్డులోని ప్రధాన డ్రెయినేజీల్లో ఈ సమస్య తీవ్రంగా ఉంది. సమాచారం తెలుసుకున్న మున్సిపల్ కమిషనర్ వెంకయ్య వాటిని కార్మికులతో తొలగింపజేశారు.



నూజెండ్ల మండలం జంగాలపల్లి ఎస్సీ కాలనీలో సుమారు 15 ఇల్లు జలదిగ్బంధంలో ఉన్నాయి. వర్షపు నీరు కాలనీ చుట్టుముట్టడంతో పాటు దిగువలో ఉన్న నివాస గృహాల్లోకి నీరు చేరింది. ఎస్సీ కాలనీకి డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వలన వర్షం నీరంతా ఎల్ల మధ్యలో నిలిచి చెరువును తలపిస్తోంది.



ప్రజాశక్తి-ఈపూరు

మండలంలో వ్యవసాయ బోరు మోటార్ల కింద సాగుచేసిన వరి, మిర్చి పైర్లు మిచౌంగ్ తుపాను ప్రభావంతో నేలకొరిగాయి. సోమవారం రాత్రి నుండి ఈదురు గాలులతో కూడిన వర్షం పడుతుండటంతో అగ్నిగుండాల, ఊడిజర్ల, నల్లగొండ తండా, ఎర్రకుంట తండా, ఈపూరు, బొమ్మరాజుపల్లి, వనికుంట, అంగలూరు, శ్రీనగర్, బొగ్గరం, గుండెపల్లి, గోపువారిపాలెం, చిట్టాపురం గ్రామాల్లో వరి, మిర్చి పైరు దెబ్బతిన్నాయి. అంగలూరుకు చెందిన కట్టా శీను, మునుగోటి శేషయ్య మూడు ఎకరాల్లో సాగుచేసిన రేగి చెట్లు విరిగాయి. పంట కోత సమయంలో తుపాను తమను తీవ్రంగా దెబ్బతీసిందని రైతులు ఆవేదనకు గురవుతున్నారు.

భారీ వర్షంతో ఉరకెత్తిన పంటలు

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

చెమటోడ్చి కష్టించి పండించిన వరి రైతులను మిచాంగ్ తుపాన్ నట్టేట ముంచింది. పెద్ద ఎత్తున గాలులకు వరి పైరు నేల వాలి, కోసిన వరి ఓదెలు నీటిలో మునిగి తెలుతున్నాయి. చేతికి అంది వచ్చిన ఉద్యాన పంటలు వర్షపు నీటిలో మునిగి పోయాయి. దీంతో పంటలు కుళ్లిపోయి తెగుళ్ల సోకే ప్రమా దం ఉందని రైతులు వాపోతు న్నారు. వరియంత్రాలతో నూర్పిళ్లు చేసిన పొలాల్లో రెండవ పంట కింద మొక్కజొన్న విత్తనాలు వేశారు. అయితే భారీ తుపాను కారణంగా పొలాల్లో నీరు చేరి వేసిన మొక్కజొన్న విత్తనాలు పూర్తిగా మురిగి పోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి సుమారు రూ. 15 వేలు పైగా ఇప్పటివరకు పెట్టుబడి పెట్టామని, ఇదంతా నష్టపోయామని రైతులు కన్నీటి పర్యంతం అవుతున్నారు. పొన్నూరు మండలంలో సుమారు 62వేల ఎకరాల్లో వరి పంట వేశారు. తుపాను ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులతో వరి పైరు పడిపోవటంతో వరి యంత్రాలకు గిరాకీ పెరిగింది. ఎకరం వరి పైరు నూర్పిడి చేయడానికి గంట సమయం పడుతుంది. ఎకరానికి రూ. 3500 తీసుకునేవారు. దీంతో ఎకరా వరి పైరు నూర్పిడి చేయడానికి మూడు గంటల సమయం పడుతుండటంతో గంటకు మూడు వేల రూపాయలు చొప్పున సుమారు 10,500 రూపాయలు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు. ధాన్యం రంగు మారిందని, తుపాను ప్రభావంగా కురుస్తున్న భారీ వర్షాలకు ధాన్యం తడిసి నాణ్యత తగ్గింది. 75 కిలోల బస్తా ధాన్యం వారం రోజుల క్రితం రూ 1700 ధర పలుకుగా, తుపాను వల్ల ధాన్యం ధర రూ 1400 తగ్గించి రైతులు వద్ద ధాన్యం కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. మండలంలో కొన్నిచోట్ల తడిసిన ధాన్యంను రాశులుగా చేసి పట్టాలతో కప్పుతున్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యంను ప్రభుత్వం గిట్టుబాటు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని, నష్టపోయిన పంటలకు ప్రభుత్వం పరిహారం అందించాలని రైతులు కోరుతున్నారు.


పొన్నూరు మండలం ఆలూరు గ్రామంలో నీట మునిగిన బెండ తోటలు


తుమ్మపూడిలో పట్టాలుకప్పిన వరి పొలాన్ని పరిశీలిస్తున్న సిపిఎం నాయకులు

వర్షం పెరిగితే గింజలో మొలకలొస్తాయి

ప్రజాశక్తి - దుగ్గిరాల

గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షం మంగళ వారం తీవ్ర రూపం దాల్చింది. దీనితో పంట పొలాలకు తీవ్రంగా నష్టం వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండటంతో పంట పొలాల్లో నీరు బయటకు పంపించేందుకు రైతులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు. దీనితో పంట చేలు నీట మునిగి పోయాయి. ఇప్పటివరకు వరిచేలకే నష్టం వాటిల్లింది. ఇంకా వర్షాలు పెరిగితే వాణిజ్య పంట లైన పసుపు, మినుము కూరలు పూల తోటలకు కూడా నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని రైతులు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా ఉన్న 22వేల ఎకరాల్లో దాదాపు పదివేల ఎకరాలు పంట పడిపోవటమో నీట మున గ టం గాని జరిగిందని మండల వ్యవసాయ అధికారి పి శిరీష తెలిపారు. ప్రస్తుతం నష్టం అంచనా వేయడం కష్టమని వర్షం ఆగిన తర్వాత పరిస్థితిని బట్టి నష్టం అంచనా వేస్తామన్నారు. ఇంకా వర్షాలు కురిసినట్లయితే విత్తనం మొలకెత్తే ప్రమాదం ఉందని తెలిపారు.

ఇంజన్లద్వారా సాగు చేశాము

బుల్ల నాగేశ్వరరావు, రైతు, పెనుమూలి



ఖరీఫ్‌లో కాలువల ద్వారా సాగునీరు అందించ లేక పోవడంతో ఇంజన్ల ద్వారా నీరు పెట్టి పండిం చాము. పంట చేతికొచ్చే సమయంలో తుపాను విరుచుకుపడటంతో పెట్టుబడి కూడా రాదేమోనని ఆందోళనగా ఉంది. మినప పంట సైతం దిగుబడి తగ్గిపోతుంది.

రెండ్రోజుల్లో కోతలు మొదలెట్టాలనుకున్నా...

సిఖా పల్లి సంగీతరావు, కౌలు రైతు, కంఠంరాజు కొండూరు



నాలుగుఎకరాలు కౌలుకు వేస్తున్నాను. రెండు రోజుల్లో కోతలు మొదలు పెట్టాల ను కున్నాను. కానీ అకాల వర్షం వచ్చి పంట నీట మునిగిపోయింది. దాదాపు లక్ష రూపాయలు నష్టం వస్తుంది. ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలి.

రైతుల వద్ద ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలి

దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించిన రైతుసంఘం నాయకులు

ప్రజాశక్తి - తాడేపల్లి రూరల్ : జిల్లా వ్యాప్తంగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, రైతుల వద్ద నుండి వెంటనే కొనుగోలు చేయాలని, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షులు జొన్న శివశంకరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఎం.టి.ఎం.సి పరిధిలోని గుండి మెడ, చిర్రావూరు గ్రామాలలో రైతు సంఘం నాయకులతో కలిసి వరి పొలాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకరరావు మాట్లాడుతూ మిచోంగ్ తుఫాను ప్రభావంతో ఎడతెరిపి లేని వర్షాలు కురుస్తుండడంతో ధాన్యం పండించిన రైతులు ఆందోళనలో ఉన్నారని అన్నారు. ఆరుగాలం కష్టపడి, సేద్యం చేసి, పండించిన వరి ధాన్యం చేతి కందిన వెంటనే అకాల వర్షాలు కురవడం వలన, కల్లాలలోనే తడిచి, రంగు మారే ప్రమాదం ఉందన్నారు. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలన్నారు. మినుము, పెసర వంటి పంటలు, పూల తోటలు, ఆకుకూరల మడులలో వర్షపు నీరు చేరడం వలన పంటలు దెబ్బ తినే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి, రైతుల వద్ద తడిచి, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేసి, రైతులను ఆదుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం తాడేపల్లి మండల అధ్యక్షులు మోదుగుల శ్రీనివాసరెడ్డి, రైతు సంఘం తాడేపల్లి మండల నాయకులు దొంతి రెడ్డి వెంకట్ రెడ్డి, రైతు సంఘం నాయకులు పెద్ది శెట్టి వీరస్వామి, చిర్రావూరు గ్రామ రైతులు పల్లపాటి సుబ్బారావు, యడ్లపల్లి శంకర్రావు, పోకల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-తెనాలి : తుపాను ప్రభావంతో దెబ్బతిన్న పొలాల్లో పంటనష్టం అంచనా వేయాలని, ఎకరానికి రూ.25వేలు పరిహారంగా చెల్లించాలని ఏపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ములకా శివసాంబిరెడ్డి డిమాండ్ చేశారు. తెనాలి పరిసర ప్రాంతాలైన ఐతానగర్, నేలపాడు, తేలప్రోలు గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించి, దెబ్బతిన్న పొలాలను పరిశీలించారు. రైతులతో మాట్లాడారు. ఈ సందర్భ:గా ఆయన మాట్లాడుతూ పది రోజుల నుంచి వరి కోతలు జరుగుతున్నా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయలేదన్నారు. ఆర్బీకే కేంద్రాలు ధాన్యం కొనుగోలుకు ఏమాత్రం సిద్దంగా లేవన్నారు. తుపానుకు దెబ్బతిన్న పొలాలకు ఈ క్రాప్ బుకింగ్, తేమశాతం అంటూ నిబంధనలు విధించకుండా ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. యార్డులలో సరకు ఆరబెట్టుకునేందుకు డ్రైయ్యర్లను సిద్దం చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు నాయకులు చిట్టిబాబు, ఎ.శ్రీనివాసరావు, ఎం.రవి, టి.నాగేశ్వరరావు, వి.శ్రీహర్ష, పి.బాబురావు, ఇ.బాబు, వి.నాగేశ్వరరావు, పి.కిషోర్ పాల్గొన్నారు.


తుపానుతో తడిచి, నేలకొరిగిన వరి పైరును పరిశీలిస్తున్న జొన్న శివశంకరరావు, రైతు సంఘం నాయకులు


తెనాలి మండలంలో దెబ్బతిన్న పొలాలను పరిశీలిస్తున్న సాంబిరెడ్డి తదితరులు

ప్రజాశక్తి -పెదకాకాని రూరల్ : పెదకాకాని మండల పరిధిలోని పెదకాకాని గోళ్ళ మూడీ నంబూరు ఉప్పలపాడు తక్కెళ్ళపాడు వెంకటకృష్ణా పురం అనమ ర్లమూడి తంగెళ్ళమూడి గ్రామలలో మిచాంగ్ తుఫాన్ కారణంగా పొలాలలో వరి పంట గాలికి మొత్తం నేలమట్టం అయ్యిందని సిపిఎం నాయకులు నన్నపనేని శివాజి తెలిపారు. మంగళవారం ఆయన దెబ్బతిన్న పొలాలను నాయకులు నీలాంబరంతో కలసి పరిశీలించారు.


పెదకాకాని మండలంలో వరి పొలాన్ని పరిశీలిస్తున్న శివాజి



బస్టాండ్‌లోకి బారీగా వర్షపునీరు

ప్రజాశక్తి-తెనాలి



తుపాను ప్రభావంతో భారీ వర్షం కురిసింది. బలమైన గాలులు వీస్తుస్తున్నాయి. జనజీవనం స్థంభించిపోయింది. పట్టణంలోని పలు ప్రాంతాల్లో వర్షపునీరు చేరింది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి మంగళవారం వరకూ భారీ వర్షం, బలమైన గాలులు వీచాయి. దీంతో స్థానిక బోస్‌రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం మొదలు, స్వరాజ్ కూడలి వరకూ రోడ్డుపై భారీగా వర్షపు నీరు చేరింది. అలాగే బుర్రిపాలెం రోడ్డు, కొత్తపేటలోని ఫైర్ ఆఫీస్ రోడ్డులోనూ బారీగా వర్షం నీరు చేరింది. దీంతో పాదచారలు, ద్విచక్ర వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. పట్టణంలోని ఆర్టీసి బస్టాండ్ ఆవరణలోనూ వర్షపు నీరు చేరటంతో ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రూరల్ పరిధిలో తెనాలి-చందోలు ఆర్‌అండ్‌బి రోడ్డులో పెదరావూరు-కూచిపూడి మధ్య రోడ్డుపై చెట్టు కూలింది. దీంతో అప్రమత్తమైన ఆర్‌అండ్‌బి, పోలీస్, రెవిన్యూ యంత్రాగం దానికి వెంటనే తొలగించినట్లు ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు తెలిపారు.

ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరే రైతులను నిలువునా ముంచింది

రైతులను ఆదుకోవాలి, తక్షణ సాయం అందించాలి : జనసేన

ప్రజాశక్తి- తెనాలి

తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని, తక్షణసాయంగా ఎకరానికి రూ 20వేలు చెల్లించాలని జనసేన పిఎసి చైర్మన్ నాదెండ్ల మనోహర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రెండు రోజులుగా తుపాన్ కారణంగా కురుస్తున్న వర్షాలు, గాలులతో రైతులు నష్టపోయిన విధానాన్ని ఆయన తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక బోస్ రోడ్ లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఫసల్ బీమా పథకానికి సంబంధించి ప్రభుత్వం చెల్లించాల్సిన వాటా ,రూ.1100 కోట్లు చెల్లించని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి రైతుల నష్టానికి కారణమైందన్నారు. . కనీసం నీరందించలేని పరిస్థితుల్లో సొంతంగా మోటర్లు పెట్టుకుని రైతులు కష్టపడి పంటలు కాపాడుకున్నారన్నారు. నియోజకవర్గంలో 33 వేల ఎకరాలలో వరి సాగులో ఉందని కనీసం 10 శాతం కూడా కోతలు పూర్తి కాలేదని అన్నారు. ఈ నేపథ్యంలో రైతులు పూర్తిస్థాయిలో నష్టపోయిన వైనం ప్రభుత్వం గుర్తించాలన్నారు. ప్రభుత్వ చర్యలు రైతాంగానికి అపార నష్టం కలిగిస్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, రైతులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో పార్టీ నేతలు బండారు రవికాంత్, ఇస్మాయిల్ బేగ్, హరిదాసు గౌరీశంకర్, యెర్రు వెంకయ్య నాయుడు, దివ్వెల మధుబాబు, జాకీర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

9న అవినీతి వ్యతిరేక కవి సమ్మేళనం

ప్రజాశక్తి-గుంటూరు

అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవం సందర్భంగా 9న ఆప్, , అమరావతి సాహితీ మిత్రులు సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆప్ రాష్ట్ర ప్రతినిధి డాక్టర్ టి.సేవాకుమార్, అమరావతి సాహితీ మిత్రులు అధ్యక్షులు డాక్టర్ రావి రంగారావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అవినీతి వ్యతిరేక కవితల పోటీలలో బహుమతి పొందిన కవులకు నగదు, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కారం ఉంటుందన్నారు. అవినీతి వ్యతిరేక కవితల పోటీకి కవితలు పంపినవారితో పాటు పోటీలో పాల్గొనలేని కవులు కూడా అవినీతి వ్యతిరేక కవితలతో వచ్చి ఈ కవి సమ్మేళనంలో పాల్గొనవచ్చునని వారు తెలిపారు. ఈ సమ్మేళనంలో ప్రముఖ సాహితీవేత్త రావెల సాంబశివరావు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, ప్రముఖ సాహిత్య విశ్లేషకులు డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి మొదలైన కూడా పాల్గొంటారని వారు తెలిపారు.



డేటా ప్రొసెసింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శివశంకర్

సత్తెనపల్లిలో డేటా ప్రాసెసింగ్ సెంటర్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగనన్న శాశ్వత భూ హక్కు భూరక్ష పథకం జిల్లా డేటా ప్రాసెసింగ్ సెంటర్‌ను స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భూములు రీసర్వే రికార్డులను కంప్యూటరీకరణ చేసేందుకు డేట్ ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఆర్డీఓ బిఎల్ఎన్ రాజకుమారి, జిల్లా సర్వే భూ రికార్డుల అధికారి వై.నాగశేఖర్, తహశీల్దార్ సురేష్ పాల్గొన్నారు.

పాలవెల్లువ లక్ష్యాలను పూర్తి చేయండి

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

జగనన్న పాలవెల్లువ లక్ష్యాలను పూర్తి చేయాలని పంచాయతీ కార్యదర్శులను పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు. సత్తెనపల్లి మండల పరిషత్ కార్యాలయాన్ని జెసి మంగళవారం తనిఖీ చేశారు. జగనన్న పలవెల్లువ దరఖాస్తులను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యదర్శుల శిక్షణలో మాట్లాడారు. ఎఫ్ లైన్ అప్లికేషన్ పెట్టెటప్పుడు రెవెన్యూ రికార్డుల్లో పేరు తప్పని సరిగా ఉండాలని డిజిటల్ అసిస్టెంట్లకు సూచించారు. దరఖాస్తు పెట్టెటప్పుడు జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జివి సత్యనారాయణ పాల్గొన్నారు.

అందుబాటులో అధికారులు

ప్రజాశక్తి - వినుకొండ

తుపాను ప్రమాద హెచ్చరికల నేపథ్యంలో తహశీల్దార్ కిరణ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ వెంకయ్యతోపాటు వివిధ శాఖల అధికారులు సోమవారం నుండి ప్రజలకు అందుబాటులో ఉన్నారు. వినుకొండ పట్టణంతోపాటు గ్రామీణ ప్రాంత ప్రజలు తుపాను కారణంగా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తేవాలని సూచించారు. సచివాలయ ఉద్యోగులతో పాటు గ్రామాల్లో వాలంటీర్లను అప్రమత్తం చేసి ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో సమాచారాన్ని తెలుసుకుంటున్నారు. సంక్షేమ హాస్టళ్లను తహశీల్దార్ సందర్శించి విద్యార్థుల భోజన సదుపాయాలపై సమీక్షించారు. విద్యార్థుల వసతిపై సమీక్షించారు. బీసీ హాస్టల్లో పెచ్చులూడిన వసతి గదులను పరిశీలించి జాగ్రత్తలు తీసుకోవాల్సిందిగా వార్డెన్‌ను ఆదేశించారు. గ్రామాల్లో శిథిలావస్థలో ఉన్న ఇళ్లల్లో ఎవరూ ఉండొద్దని సూచించడంతోపాటు సహాయ చర్యలు చేపడుతున్నారు.



ముంచుతున్న మిచౌంగ్



నరసరావుపేట మండలం పమిడిమర్రులో పడిపోయిన మొక్కజొన్న పైరు

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

మిచౌంగ్ తుఫాన్ ప్రభావంతో సోమవారం ఉదయం నుండి ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షం మంగళవారమూ ఈదురు గాలులతో మరింతగా పెరిగింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. నరసరావుపేట పట్టణంలో రామిరెడ్డిపేటలో ఇటీవల భవన నిర్మాణాలు చేపట్టే ప్రాంతాల్లో లోతైన గోతులు తీసి ఉండడంతో పక్కనే ఉన్న ప్రహరీలు పడిపోయాయి. టీచర్స్ కాలనీలో విద్యుత్ స్తంభం విరిగి పడిపోయింది. రామిరెడ్డిపేటలో భారీ చెట్టు విరిగి కారుపై పడిపోవడంతో కారు పాక్షికంగా దెబ్బతింది. విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడింది. రెవెన్యూ అధికారులు, పోలీసులు, విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నామని ప్రజలకు చెబుతున్నా క్షేత్ర స్థాయిలో అధికారులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. చలి ఎక్కువగా ఉండడంతో రోడ్లపైకి రావడానికి ఎవరు సాహసించడం లేదు. జిల్లా వ్యాప్తంగా సోమవారం నుండి మంగళవారం ఉదయం వరకు 44.7 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైందని జిల్లా కలెక్టర్ కార్యాలయం నుండి ప్రకటన విడుదల చేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఇదిలా ఉండగా తుపాను నేపథ్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో ఈదురు గాలులకు చెట్లు విరిగిపడి విద్యుత్ లైన్లు తెగిపడ్డాయి. ఆప్తమత్తమైన విద్యుత్ శాఖ సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. బుధవారం తెల్లవారుజాము వరకు పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఈదురు గాలులు, వాన కారణంగా మరమ్మతులకు ఆటంకం ఏర్పడుతున్నట్లు చెప్పారు. మరమ్మతులు అనంతరం విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.



గణపవరం నుండి చిలకలూరిపేట వెళ్లే రహదారిలో పొంగి పొర్లుతున్న కుప్పగంజి వాగు

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలో ఖరీఫ్ సాగుగా 6250 ఎకరాల్లో పత్తి, 4500 ఎకరాల్లో మిర్చి, 170 ఎకరాల్లో కంది, 2875 ఎకరాల్లో శన, 190 ఎకరాల్లో పొగాకు 32 ఎకరాల్లో మొక్కజొన్న, 15 ఎకరాల్లో మినుము సాగైంది. తుపాను నేపథ్యంలో ఈ పంటలన్నీ దెబ్బతిన్నాయి. రైతులకు తీవ్ర నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వర్షాలు ఆగిన వెంటనే పొలాల్లోని నీటిని బయటకు పంపాలని, అధిక తేమ ఉన్నట్లయితే ఎకరాకు 15 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్ కలిపి మొక్కల మొదల్లలో వేయాలని మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్ సూచించారు.

మరోవైపు భారీ వర్షాలకు మండలంలోని పలు రహదారులు జలమయమయ్యాయి. వాగులు పొంగిపొర్లుతున్నాయి నరసరావుపేట - చిలకలూరిపేట మార్గంలో మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం రహదారిపై నీళ్లు ప్రవహిస్తూ వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గణపవరం నుండి చిలకలూరిపేట వెళ్లే దారిలో కుప్పగంజి వాగు పొంగిపొర్లుతోంది. నాదెడ్ల నుండి తిమ్మాపురం వెళ్లే రహదారిలో వాగు పొంగుతున్నాయి. ఆయా మార్గాల్లో వాహన రాకపోలకు అంతరాయం కలుగుతోంది.



సత్తెనపల్లి పట్టణం జాషువా నగర్‌లో నిలిచిన నీరు

ప్రజాశక్తి- సత్తెనపల్లి

పట్టణంలో గత రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షం పడడంతో డ్రెయినేజీ కాల్వలు పొంగిపొర్లి రోడ్లన్నీ జలమయమయ్యాయి. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరి నివాసితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాషువానగర్, నాగన్నకుంట, సుందరయ్య కాలనీల్లో ఇళ్లల్లోకి వర్షపు నీరు ఇచ్చి చేరాయి. భారీ వర్షాలొచ్చిన ప్రతిసారీ ఇదే ఇబ్బందులు ఎదురవుతున్నాయని, శాశ్వత పరిష్కారం చూపాలని ప్రజలు కోరుతున్నారు.



సత్తెనపల్లి రైల్వే స్టేషన్‌లో ట్రాక్‌పైకి చేరిన నీరు

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భారీ వర్షాలకు సత్తెనపల్లిలోని రైల్వేట్రాక్ నీటమునిగింది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు సత్తెనపల్లి స్టేషన్‌లోని మొదటి ఫ్లాట్‌ఫాంలో ట్రాక్‌పైకి వర్షపు నీరు చేరటంతో రైళు రాకరాపోకలకు అంతరాయం ఏర్పడింది. రైళ్ల రాకరాపోకలను రెండో ప్లాట్ మీదుగా నడిపారు.



ప్రజాశక్తి - వినుకొండ

వినుకొండ-అద్దంకి రాష్ట్ర రహదారి ఏనుగుపాలెం రోడ్డులో భారీ గుంతల్లో వర్షపు నీరు నిలిచి ప్రమాదం పొంచింది. వినుకొండ నుంచి సుమారు 20 కిలోమీటర్లు వరకు ఏనుగుపాలెం రోడ్డు గోతులమయం కావడం, రెండు రోజుల నుండి వాన పడుతుండడంతో ఆ గుంతల్లో నీరు చేరింది. దీంతో రహదారి అర్థం కాక వాహనదార్లు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఉన్న సుమారు 15 గ్రామాల ప్రజలకు మరో ప్రత్యామ్నాయం లేదు. ఇప్పటికే అనేక ప్రమాదాలు సంభవించి పలువురు ప్రాణాలు పోగొట్టుకోగా మరికొందరు వైకల్యానికి గురయ్యారు.

ప్రజాశక్తి - అమరావతి

మండల పరిధిలోని నరుకుళ్లపాడు, యండ్రాయి, వైకుంటపురం, లింగాపురం గ్రామలలో పంట పొలాలను వ్యవసాయ శాఖ ఎడి వి.హనుమంతరావు మంగళవారం పరిశీలించారు. వరిపొలాల్లో వర్షపు నీరు నిలువకుండా చిన్నిచిన్ని కాలువలు తీసి బయటకు పంపాలని సూచించారు. తాలు గింజలు, రంగు మార్పిడి కాకుండా పైరుకు కార్బెండజిమ్ 1 గ్రాము లీటరుకు, లేదా మాంకోజెట్ 2 గ్రాములు లీటరు పిచికారీ చేసి పైరుకు చల్లాలన్నారు. ఏవో అహ్మద్ మాట్లాడుతూ పత్తి, మిరప, మినుము, శనగ, కంది సాగు చేసిన రైతులు పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని చెప్పారు.





మాట్లాడుతున్న గోపాలరావు, విజయ్‌కుమార్

పంట నష్టపరిహారం ఇవ్వాలి

పంటలను మద్దతు ధరకు కొనాలి : సిపిఎం, రైతుసంఘం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

మిచౌంగ్ తుపానుతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఇప్పటి వరకు రైతులు దగ్గర ఉన్న పంటలకు మద్దతు ధరకు కొనాలని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్ కుమార్, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఏపూరి గోపాలరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు విజ్ఞాన కేంద్రంలో వారు మాట్లాడుతూ పల్నాడులో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 50 శాతం మాత్రమే సాగైనదని, నీటి ఎద్దడి వల్ల చాలా వరకు పైరు దెబ్బతిందని, రబీలో సాగు చేసిన పంటలను తుపాను నష్టపరిచిందని చెప్పారు. ప్రకృతి విపత్తుల కింద తక్షణమే నష్ట పరిహారం ఇవ్వాలన్నారు. ఈ మేరకు తక్షణమే ప్రకటన విడుదల చేసి రైతుల్లో భరోసా కల్పించాలని కోరారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో ఆహార సంక్షోభం రాకముందే వ్యవసాయ రంగానికి, రైతులకు రాయితీలు అన్ని విధాలుగా భరోసా కల్పించాలని సూచించారు. రైతుల పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యం వహిస్తున్నాయని, ఇప్పటికైనా తమ విధానాలను మార్చుకుని ఎరువులు, విత్తనాలు, పురుగుమందులను అందించాలని, రైతు భరోసా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలని కోరారు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతులకు అందుబాటులో ఉండి సలహాలు సూచనలు ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు.

పాఠశాలలకు బుధవారమూ సెలవు

ప్రజాశక్తి - పెదకూరపాడు

తుపాను ప్రభావంతో బుధవారం కూడా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలకు సెలవు ప్రకటిస్తున్నట్లు పెదకూరపాడు మండల విద్యాధికారి తాడిశెట్టి సత్యనారాయణ మంగళవారం ప్రకటించారు. వర్షం ఎక్కువగా ఉండటంతో పెదకూరపాడు మండలంలో జిల్లా అధికారుల సూచనల మేరకు సెలవు ఇస్తున్నట్లు తెలిపారు.

తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్

ప్రజాశక్తి - నకరికల్లు

మండలంలో 70.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ నగేష్ మంగళవారం తెలిపారు. మిచౌంగ్ తుపాను నేపథ్యంలో తమ కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామన్నారు.

ప్రజాశక్తి - చిలకలూరిపేట : తుపాను ప్రభావంతో రెండ్రోజులుగా భారీ వర్షాల నేపథ్యంలో చిలకలూరిపేట మండలం, పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ జి.సుజాత కోరారు. లోతట్టు ప్రాంతాల్లోని వారు పునరావాస కేంద్రాలకు వెళ్లాలని, పంట నష్టం జరిగితే వెంటనే తహశీల్దారు కార్యాలయం లేదా వ్యవసాయాధికారి కార్యాలయాల్లో తెలపాలని సూచించారు. ఎక్కడ ఇబ్బంది వచ్చినా 9849904025, 7416885743 ఫోన్ నంబర్లకు సంప్రదించాలని సూచించారు.

ప్రజాశక్తి 7
గుంటూరు జిల్లా
బుధవారం 6 డిసెంబర్ 2023

కంట్రోల్‌రూమ్‌కు ఫోన్ చేయండి : ఎస్‌పి

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఐపిఎస్ పొన్నూరు రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో రహదారి పై ఒక చెట్టు పడిపోయి వుండటం వలన వెంటనే స్పందించి అక్కడ ట్రాఫిక్ అంతరాయం లేకుండా దగ్గరే వుండి పడి పోయి వున్న చెట్టును సిబ్బందితో స్వీయ పర్యవేక్షణలో తొలగించి రహదారిపై ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేశారు. ప్రజలకు ఏ విధమైన సహాయ, సహకారాలు కావాల్సి ఉన్న జిల్లా పోలీస్ కార్యాలయం ఏర్పాటు చేసిన పోలీస్ కంట్రోల్ రూమ్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 8688831568 ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలియజేశారు. ఈ పర్యటనలో గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఐపిఎస్ వెంట తెనాలి డి ఎస్ పి జనార్ధన్ రావు , స్పెషల్ బ్రాంచ్ సి ఐ శ్రీనివాస రావు , పొన్నూరు రూరల్ యస్ ఐ బండ్ల. భార్గవ్ ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు 'కంతేటి'కి అభినందనలు

ప్రజాశక్తి -మంగళగిరి

మంగళగిరి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నూతనంగా పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులుగా నియమితులైన కంతేటి జీవన్ సాగర్‌ను మంగళవారం పార్టీ ఇంచార్జ్ షేక్ సలీం, నాయకులు, కార్యకర్తలు అభినందించారు. జీవన్ సాగర్‌ను శాలువా పూలమాలతో సత్కరించారు. అనంతరం పార్టీ ఇంచార్జ్ సలీం మాట్లాడుతూ జీవన్ సాగర్ పట్టణంలో అన్ని వర్గాల్లోకి పార్టీని తీసుకెళ్లి పార్టీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కాపు సాధికారిక ఛైర్మన్ రేమినిశెట్టి హనుమంతరావు, మండల కాంగ్రెస్ అధ్యక్షులు కొప్పాకుల కష్ణారావు చౌదరి, నాయకులు కూర్మాల దుర్గాప్రసాద్, దర్శనపు శామ్యూల్ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ అధికారులతో సమీక్ష

ప్రజాశక్తి - మంగళగిరి

కార్పొరేషన్ పరిధిలో తుపాను ప్రభావం ఉన్న ప్రజలకు తీసుకోవాల్సిన చర్యలపై ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు మంగళవారం కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష జరిపారు. వెంటనే అధికార యంత్రాంగం కదిలి వర్షాల వలన నష్టపోయిన ప్రజలకు సహాయ సహకారాలు అందించాలని వారు కోరారు. సమావేశంలో ఎం టి ఎం సి కమిషనర్ వి నిర్మలా కుమార్, అడిషనల్ కమిషనర్ కే హేమమాలిని, డిప్యూటీ ఇంజనీర్ ఎస్వీ కృష్ణారెడ్డి వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ముక్కోటి ఉత్సవ పోస్టర్లు, ఆహ్వాన పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - మంగళగిరి : నగరంలో శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈనెల 22,23, తేదీల్లో నిర్వహించనున్న ముక్కోటి వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు హాజరయ్యే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు అధికారులకు సూచించారు. మంగళవారం దిగువ సన్నిధి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థాన ఆవరణలో ముక్కోటి ఏకాదశి వాల్ పోస్టర్లు, ఆహ్వాన పత్రికలను వారు ఆవిష్కరించి అనంతరం ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు లు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఎగువ, దిగువ సన్నిధిల్లో ఎంపిక చేసిన ప్రాంతాల్లో తాత్కాలిక క్లాక్ రూమ్ లతో పాటు యూపీహెచ్ వైద్యులతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు. తాత్కాలిక టాయిలెట్లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యుత్ సరఫరా లో ఎటువంటి అవాంతరాలు కలుగ కుండా చూడాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జీవీ రామ్ ప్రసాద్, దేవస్థాన ఈఓ ఏ రామకోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర చేనేత విభాగం అధ్యక్షుడు గంజి చిరంజీవి, నగరపాలక సంస్థ కమిషనర్ వి నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జిజిహెచ్ ప్రతిష్టను దెబ్బ తీయవద్దు

సూపరింటెండెంట్ డాక్టర్ వై.కిరణ్ కుమార్ ఏజైల్ సంస్థకు నోటీసులు

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి



ప్రభుత్వ ఆసుపత్రి ప్రతిష్టను దెబ్బ తీయవద్దని, ఆసుపత్రి పరిశుభ్రంగా లేకపోతే సహించనని సూపరింటెండెంట్ డాక్టర్ వై కిరణ్ కుమార్ తెలిపారు. లక్షలలో టెండర్ సొమ్ము తీసుకుంటూ చాట, చీపిరి పరికరాలతోనే పరిశుభ్రత చేయడం బాధాకరం అన్నారు. కార్మికుల శ్రమ దోపిడీకి పాల్పడుతున్న ఏజైల్ సంస్థకు నోటీసులు జారీ చేశామన్నారు. ప్రభుత్వ ఆసుపత్రికి రోజుకు మూడు వేల నుంచి నాలుగు వేలకు పైగా రోగులు వారి సహాయకులు మరో నాలుగు వేల మంది మొత్తం ఎనిమిది వేల మంది వస్తుంటే పరిశుభ్రతను పాటించకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. మంగళ వారం క్యాజువాల్టీని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసారు. క్యాజువాల్టీ అపరిశుభ్రంగాఉండటం పై పారిశు ధ్య సిబ్బంది పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేసారు. రోజుకు 240 మంది పారిశుధ్య కార్మికులు విధుల్లో పని చేయాల్సి ఉండగా కేవలం 170 మంది మాత్రమే పని చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఆసుపత్రి పరిశుభ్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఆసుపత్రిలో ప్రతి ఫ్లోర్ ను పరిశుభ్రంగా ఉంచాలి. అవసరమైన ఆధునిక పరికరాలను అందుబాటు లో ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని అయన చెప్పారు. పురాతన పద్ధతుల్లో మాత్రమే చీపురు, చాటలు తప్ప ఏ ఆదునీక పరికరాలు లేకపోవడం పై ఆయన అసంతప్తి వ్యక్తం చేసారు. ఒకవైపు ఏజెన్సీ సంస్థ కార్మికుల శ్రమ దోపిడీ కి పాల్పడుతున్నారని అర్ధమవుతుందని అయన చెప్పారు. పారిశుధ్య కార్మికుల చేత వెట్టి చాకిరీ చేయిస్తూ సకాలంలో జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని అయన మండిపడ్డారు. రోజుకు అయిదు సార్లు ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అయన అన్నారు. ఆసుపత్రి లో పరిశుభ్రత లేక పోతే సహించేది లేదన్నారు. ఈ విషయాన్నీ జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి, డిఎంఈ డాక్టర్ నరసింహం కు తెలియచేస్తానని ఆయన చెప్పారు. ఇకనైనా పద్ధతులు మార్చుకుని పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు తీసుకోవాలని ఏజైల్ సంస్థ ను ఆదేశించారు. ఆసుపత్రి లో పరిశుభ్రత లోపించిందని ఒక వైపు తుపాను వాతావరణం తో అధికారులు అప్రమత్తం చేస్తుంటే మరోవైపు పారిశు ద్యం సంస్థ కు మాత్రం చీమ కుట్టినట్లు కూడా లేదని ఆయన చెప్పారు. కొంతమంది పారిశుధ్య కార్మికుల్లో నిర్లక్ష్యం, సమయానికి రావడం లేదని ఆరోపణలు వినపడుతున్నాయన్నారు. అలాంటి వారిని వెంటనే తీసివేయాలని ఆయన ఆదేశించారు. ఆసుపత్రి లో సరిగా పని చేయమని అడిగితే అధికారులపై తిరగబడ్డ స్థాయికి తీసుకుని వస్తున్నా ఎజైల్ సంస్థ పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశాంత వాతావరణం లో రోగులకు సేవ యె పరమార్ధం గా చూడకుండా పెడదారి పెడితే అలాంటి వారిని తీసి వేయాలని ఆయన ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, ఇంచార్జి సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ రఘూన్సీ, సిఎంఓ డాక్టర్ విశ్వనాధ్, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశ సజని పాల్గొన్నారు.

రైతుల్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలి : ధూళిపాళ్ల

ప్రజాశక్తి - పొన్నూరు రూరల్

నాలుగేళ్ల పాలనలో వ్యవసాయ రంగాన్ని నిర్లక్ష్యం చేశారు. ఇబ్బందులు పాలైన రైతులకు నేనున్నానని భరోసా కల్పించడంలో విఫలం అయ్యారని సంగం డైరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ దుయ్యబట్టారు. ప్రచార ఆర్భాటమే తప్ప రైతులకు చేసిందేమీ లేదన్నారు. పొన్నూరు మండలం పచ్చలతాడిపర్రు, మునిపల్లె వెల్లలూరు ప్రాంతాలలో నీట మునిగిన పొలాలలోకి వెళ్లి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గత సంవత్సరం తుపాను సమయంలో దెబ్బతిన్న పంటలు కొనుగోలు చేయడంలో నిర్లక్ష్యం వహించారు. రైతుల కోసం చంద్రబాబు పర్యటన చేస్తుంటే పోలీసులతో ధాన్యం రాశులను కాళ్లతో తన్నించిన పరిస్థితి అందరూ చూశారు. గత వారం రోజులుగా తుపాను హెచ్చరికలు వస్తున్నప్పటికీ అధికారులను అప్రమత్తం చేయటంలో విఫలం అయ్యారన్నారు. పంట చేతికి వచ్చే సమయంలో రైతులు తీవ్రంగా నష్టపోయారని ప్రభుత్వం వారిని ఆదుకోవాలని కోరారు.





స్వచ్ఛంద సేవ వాలంటీర్లకు సన్మానం

ప్రజాశక్తి -మంగళగిరి

విజయ హెల్త్ కేర్ ట్రస్ట్, బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అంతర్జాతీయ వాలంటీర్స్ డే సందర్భంగా స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు ప్రజలకు చేసిన వాలంటీర్సును రత్నాల చెరువులోని విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. రేవేంద్రపాడు లో పేద కుటుంబాన్ని దత్తత తీసుకొని నెలవారీగా ఆ కుటుంబాన్ని ఆదుకుంటున్న బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందజేస్తున్న కే స్వాతిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాయింట్ సెక్రెటరీ తిరువీధుల కిరణ్, ఏ సుబ్బారావు, బి రమేష్, కే శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో తాగునీటి సరఫరా

ప్రజాశక్తి - మంగళగిరి : మంగళగిరి పట్టణంలోని టిట్కో గహాలలో నివసిస్తున్న ప్రజలు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న జనసేన రాష్ట్ర నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు మంగళవారం కిట్కో ప్రాంతం వాసులకు ట్యాంకర్ల ద్వారా తాగునీటిని సరఫరా చేశారు.





లోతట్టు ప్రాంతాలు జలమయం

ప్రజాశక్తి - మంగళగిరి

తుపాన్ ప్రభావంతో రెండు రోజుల కురుస్తున్న వర్షాల వలన మంగళగిరి పట్టణ పరిధిలోని రత్నాల చెరువులో గల లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఇళ్లల్లోకి నీరు చేరాయి. కొన్ని ఇళ్లల్లో చేనేత మగ్గాలు కూడా ఉన్నాయి. నీళ్లు చేరడంతో పనులు లేక ఉపాధి కోల్పోయారు. ప్రభుత్వం అధికారులు స్పందించి ఆర్థిక సహాయం చేయాలని పలువురు ప్రజలు వాపోతున్నారు. అదేవిధంగా మగ్గాల షెడ్యూల్లో నీరు చేరడం వలన ఉపాధి కోల్పోయిన చేనేత కార్మికులను ఆదుకోవాలని ఏరియా చేనేత కార్మిక సంఘం కార్యదర్శి కౌతువరపు వెంకటేశ్వరరావు కోరారు.



పంట పొలాలను పరిశీలించిన జిల్లా అధికారి

ప్రజాశక్తి-తెనాలిరూరల్

తుపాను కారణంగా దెబ్బతిన్న పంట పొలాలను జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వర్లు మంగళవారం పరిశీలించారు. హాఫ్ పేట, నందివెలుగు గ్రామాల్లో రైతులతో కలసి పంట నష్టాన్ని అంచనా వేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో సాగుచేస్తున్న వరి, మినప, శనగ, కంద, మిరప పంటలకు నష్టం ఏర్పడుతుందన్నారు. తెనాలి డివిజన్ ప్రాంతంలో 16వేల ఎకరాలు వరి సాగుచేయగా సుమారు 8 వేలు ఎకరాల్లో నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని తెలిపారు. అలాగే నందివెలుగు హాఫ్ పేట ప్రాంతాల్లో సాగుచేస్తున్న 315 ఎకరాల మినప పంటలో సుమారు 105 ఎకరాలు నష్టం వాటిల్లుతుందని అంచనా వేశారు. రైతులు తమ పంటలను కాపాడుకోవాలని సూచించారు. వరిచేలకు ఆనుకొని ఉన్న గట్లుకు గండ్లు కొట్టి నీటి నిల్వను లేకుండా చూడాలన్నారు. వర్షం కారణంగా నిలిచిపోయిన నీటి నిల్వలు తగ్గిన తర్వాత 5 శాతం ఉప్పులవణాన్ని పంటపై పిచికారి చేయాలన్నారు. రైతులు ఆందోళన చెందొద్దన్నారు. ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏవో ప్రేమ్ సాగర్ వివిఎ లు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - కొల్లిపర : ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా మండలంలోని వరి పొలాలు నేలకొరిగాయి . నీట మునిగిన వరి పొలాలను వర్షపు నీటిలో నానిన మినప పంటను జిల్లా వ్యవసాయ అధికారి నున్న వెంకటేశ్వరరావు , ఏడిఏ ఉషారాణి, ఎఓ కే వెంకట్రావు ఏఈఓ సోనియా, తాసిల్దార్ నాంచారయ్య, ఎస్సై రవీంద్రారెడ్డి పరిశీలించారు.



నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కమిషనర్ కీర్తి చేకూరి

ప్రజాశక్తి-గుంటూరు

మిచౌంగ్ తుపాను తీరం దాటినా, వర్షం తీవ్రత ఉన్నందున నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షం వలన ప్రజలు ఇబ్బందులు పడకుండా జిఎంసి తగిన చర్యలు తీసుకుంటుందని నగర కమిషనర్ కీర్తి చేకూరి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షం తగ్గే వరకూ నగర ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పీకలవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తుందని, చుట్టు పక్కల నివాసితులు పిల్లలను బయటకు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పురాతన భవనాలలో నివసించే వారు వర్షం వలన గోడలు నాని కూలే ప్రమాదం ఉంటుందని తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే తుపాను వలన నగర పరిధిలో ఏమైనా సమస్యలు ఎదురైతే వెంటనే జిఎంసి కాల్ సెంటర్ 0863-2345103కి కాల్ చేయాలన్నారు. జిఎంసి నుండి తుపాను వల్ల వచ్చే సమస్యల పరిష్కారనికి 4గురు సీనియర్ అధికారులతో ప్రత్యేక బందాలను ఏర్పాటు చేశామని, ఇప్పటికే అధికారులు, కార్యదర్శులకు సెలవులు రద్దు చేశామని తెలిపారు. గాలి తీవ్రత వలన చెట్లు కూలితే పార్క్ సిబ్బంది వెంటనే తొలగించాలని, అందుకు సంబంధించిన వాహనాలు, సిబ్బందిని అందుబాటులో ఉంచాలని ఏడిహెచ్‌ని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లల్లోకి నీరు వెళితే మోటార్ల ద్వారా బెయిల్ అవుట్ చేయాలని, రిజర్వాయర్లలో తాగునీటి సరఫరాకి ఏవిధమైన ఆటంకం లేకుండా పర్యవేక్షణ చేయాలని ఏ.ఈ.లను ఆదేశించారు.



తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎస్‌పి పర్యటన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు జిల్లాలో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో మంగళ వారం జిల్లా ఎస్.పి. ఆరిఫ్ హాఫిజ్ పర్యటించారు. జిల్లాలో తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి అక్కడ భద్రతా ఏర్పాట్లు పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మరియు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుఫాను వలన ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల వలన జిల్లా పోలీసు యంత్రాంగం, ఇతర శాఖల వారి ఆధ్వర్యంలో సంయుక్తంగా ముందస్తు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఏ విధమైన అవాంఛనీయ సంఘటన జరగకుండా చూస్తూ, ప్రజలకి తుఫాను గురించి తెలియజేస్తూ ఎలాంటి విపత్కర పరిస్థితులైన ఎదుర్కునేందుకు జిల్లా పోలీస్ యంత్రాంగాన్ని సర్వసన్నద్ధంగా ఉంచటంచేసినట్లు ఆరిఫ్ హాఫీజ్ తెలిపారు. పలు ప్రాంతాల్లో గాలులకి పడిన చెట్లను వెంటనే తొలగించినట్లు తెలిపారు. తెనాలి సబ్ డివిజన్ పరిధిలోని చేబ్రోలు,పోన్నూరు రూరల్ పోన్నూరు అర్బన్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : పల్నాడు జిల్లా ఎస్‌పి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

తుపాను పరిస్థితులను ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ, రెవెన్యూ, ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ సిబ్బంది తగిన భద్రతా చర్యలు చేపడుతున్నారని సహాయక చర్యలను ప్రజలు ఉపయోగించుకోవాలని ఎస్పీ వై.రవి శంకర్ రెడ్డి అన్నారు. జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ముంపు ప్రభావం ఉన్న లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించడం, వాగు పరివాహక ప్రాంతాల వద్ద పోలీస్ పికెట్స్ ఏర్పాటు చేయడం వంటి ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టి ప్రాణ, ఆస్థి నష్టం జరగకుండా పోలీస్ వారు తక్షణ సహాయక చర్యలు చేపడుతున్నారని ప్రజలు పోలీస్ వారికి సహకరించాలన్నారు. ఈదురు గాలులకు రోడ్లపై విరిగిపడే చెట్లను, కరెంట్ స్తంభాలను వెంటనే తొలగించి, రవాణా వ్యవస్థకు, ప్రయాణాలకు, ట్రాఫిక్ అంతరాయం లేకుండా చేయడానికి ప్రత్యేక బృందాలను నియమించడం జరిగినదని తెలిపారు. పాత భవనాల కింద, పెద్దపెద్ద వృక్షాల కింద ఉండవద్దని ముంపు ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఉదృత ప్రవాహం సమయంలో కాలువలు దాటడం వంటివి చేయరాదన్నారు.ప్రయాణానికి అనువుకాని



మార్గాలు నీట మునిగిన రహదారులలో ప్రయాణించడం నిషేధమని , అటువంటి ప్రాంతాల్లో పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి, రహదారులను మూసివేసి, ఇతర మార్గాల ద్వారా వాహనాలు వెళ్లేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొని సహాయక చర్యలు అందించడానికి ప్రత్యేక పోలీస్ బలగాలు, బృందాలు అప్రమత్తం చేశామన్నారు. తుపాను కారణంగా ఏమైనా ఘటనలు తలెత్తినా, అత్యవసర పరిస్థితి వచ్చినా, ఏ విధమైన సమస్యలకు గురైనా ప్రజలు, వెంటనే మీ పట్టణ లేదా మండల పరిధిలో ఉండే పోలీస్ అధికారులకు గానీ, 100 లేదా 112 లకు ఫోన్ చేసి సమాచారం తెలపాలని, జిల్లా పోలీస్ యంత్రాగం 24/7 అందుబాటులో ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు.

నీట మునిగిన పంట పొలాలు.. తీవ్ర ఆవేదనలో రైతులు

ప్రజాశక్తి-తెనాలి

ఆరుగాలం శ్రమించాం.. పుట్టెడు అప్పులతో పెట్టు బడులు పెట్టాం. తీరా పంట చేతికి వచ్చేసరికి ప్రకృతి విలయతాడవం చేసింది. చేతికందిన పంట చేజారి పోతోంది. ఏం చేయాలి..ఎవరికి చెప్పు కోవాలి.. అంటూ రైతులు దిగాలు పడుతున్నారు. కౌలు రైతుల పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. మిచౌంగ్ తుపాను ప్రభావంతో పంట నష్ట పోయిన రైతాంగం ఆవేదన వర్ణనా తీతంగా ఉంది.



కంచర్లపాలెంలో నేలవాలిన వరి

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, వాయుగుండంగా బలపడి మిచౌంగ్ తుపాను రూపంలో విజృంబిచింది. ఫలితంగా రెండు రోజుల నుంచి భారీవర్షాలు, బలమైన గాలులు వీస్తున్నాయి. దీంతో తెనాలి ప్రాంతంలోని కంచర్లపాలెం, నందివెలుగు, హాఫ్‌పేట, నేలపాడు, తేలప్రోలు, ఐతానగర్, కఠెవరం ప్రాంతాల్లో వరి పొలాలు నీట మునిగాయి. వ్యవసాయశాఖ ఏడిఏ పరిధిలో తెనాలి, కొల్లిపర, దుగ్గిరాల మండలాల్లో దాదాపుగా 45వేల ఎకరాల్లో వరిసాగులో ఉంది. తుపాను హెచ్చరికలతో అప్రమత్తమైన రైతులు దాదాపు 8వేల ఎకరాల వరకూ కోతలు కోశారని, మరో 22వేల ఎకరాలు కోతకు సిద్దంగా ఉందని, మిగిలిన పంటలు వివిద దశల్లో ఉన్నట్లు అధికారుల గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపధ్యంలో తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు కోతకు సిద్ధమైన వరి నీటిపాలైంది. దీంతో రైతులు విలవిల్లాడుతున్నారు. ఎకరానికి దాదపు రూ.40వేల వరకు పెట్టుబడులు పెట్టామని, ఇప్పుడు దిగుబడి వచ్చే సమయానికి తీవ్రమైన నిరాశ మగిగిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



నేలపాడు రోడ్డులో పొలాల్లో చేరిన వర్షపునీరు

పదెకరాల్లో పంట నీటిపాలైంది

పాలేటి సాంబశివరావు, రైతు, ఐతానగర్



పదెకరాలలో వరి సాగు చేస్తున్నాను. కోతకు సిద్ధమైన దశలో తుపాను ప్రభావంతో కరిసిన భారీ వర్షాలు, గాలులకు మొత్తం నేలమట్టమైంది. వాస్తవానికి ఎకరానికి 40 బస్తాలు దిగుబడి వస్తుందని ఆశించాం. ఆ ఆశలన్నీ అడియాశలయ్యాయి. పడిపోయిన వరి నీటి మునిగి మొక్కమొలిచే పరిస్థితి ఉంది. ఆ ధాన్యాన్ని కొనుగోలు చేయటానికి సవాలక్ష అంక్షలుంటాయి. నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకుంటే తప్ప కోలుకునే పరిస్థితి లేదు

కె.బాబురావు, కౌలురైతు, ఐతానగర్



అప్పులు తెచ్చి పెట్టుబడులు పెట్టాం. కొంత భూమిని సాగు చేస్తున్న నేపధ్యంలో రైతుకు కౌలు ముందుగానే చెల్లించాం. ఎంతో కష్టపడ్డాం. వర్షాభావ పరిస్థితులను కూడా ఎదుర్కొన్నాం. తీరా పంట చేతికొస్తుందనుకున్న తరుణంలో భారీ వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. పంట పూర్తిగా నష్టపోయినట్లే. అసలు వ్యవసాయమంటేనే భయపడే పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో రైతును ఆదుకుంటే తప్ప కోలుకోవటం సాధ్యం కాదు.

చెరువుల్ని తలపిస్తున్న చేలు

ప్రజాశక్తి -పెదనందిపాడు

తుపాను తాకిడికి పెదనందిపాడు, కాకుమాను, ప్రత్తిపాడు మండలాల్లో మిరప, శనగ, పొగాకు పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రెండు రోజుల నుండి ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల పంటలు పూర్తిగా నీట మునిగాయి. అధిక పెట్టుబడితో సాగు చేస్తున్న



చెరువును తలపిస్తున్న పొగాకు పంట



నీటమునిగిన శనగ పంట

మిర్చి రైతులు ఇప్పటికే ఎకరానికి కౌలు కాకుండా రూ. లక్ష రూపాయలు వరకు పెట్టుబడి పెట్టారు. ఈ అకాల వర్షాల వల్ల పెట్టుబడి పూర్తిగా నష్టపోతామని వారు వాపోతున్నారు. పొగాకు, శనగ పంటలు కూడా ఈ వర్షాలతో పూర్తిగా దెబ్బతింటాయని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు పంట నష్టం అంచనావేసి, ప్రభుత్వానికి నివేదించి, నష్టపరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను పట్టించుకోండి : టిడిపి

ప్రజాశక్తి గుంటూరు జిల్లా ప్రతినిధి

లోతట్టు ప్రాంతాల ప్రజలను అధికారులు పట్టించుకోవాలని గుంటూరు తూర్పు నియోజకవర్గం టిడిపి ఇన్చార్జి నజీర్ అహ్మద్ డిమాండ్ చేశారు. మీచాంగ్ తుపాను ప్రభావంతో గుంటూరు తూర్పు నియోజకవర్గం లోని ప్రగతి నగర్‌తో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలు పడుతున్న అవస్థలను తెలుసుకొని స్థానిక నాయకులుతో కలిసి అక్కడికి చేరుకొని వారి సమస్యలను ఆలకించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ కొన్ని రోజుల ముందే తుపాను ప్రభావాన్ని గుర్తించిన అధికారులు స్థానిక లోతట్టు ప్రాంతాల్లో ఎటువంటి సదుపాయాలను సమకూర్చలేదన్నారు. చాలా ప్రాంతాల్లో రోడ్లు, ఇళ్లు జలమయవై ప్రజల ఇళ్లలో నుంచి బయటికి రాలేని పరిస్థితి ఏర్పడ్డాయని, కనీసం వారికి మంచినీటి సదుపాయం కూడా లేదని చీకటిలో ప్రజలు మగ్గుతున్నారని నగర కమిషనర్, స్థానిక వైసిపి నాయకులు, అధికారులు ప్రచార అర్బటాల్లో ఉన్న నిబద్ధత ఇక్కడ కనిపించటం లేదన్నారు. సత్వరమే అధికారులు రంగంలోకి దిగి జలదిగ్బంధంలో ఉన్న ప్రజలకు



సదుపాయాలను కల్పించాలని, ప్రభుత్వం ఈ విషయంలో పూర్తిగా విఫలమైందని స్థానిక ఎమ్మెల్యే ముస్తఫా ఇప్పటికైనా బయటకు వచ్చి ప్రజల సమస్యలను చూడాలని కనీసం మంచినీరు, విద్యుత్ సదుపాయం, వీధి దీపాలు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో ఉన్నాడని తెలియ చేసారు. టిడిపి నాయకులు యల్లావుల అశోక్, పఠాన్ జమీర్,